PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 214 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 30 జులై 2026

## గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం




## వర్షాకాలంలో శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ




# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### - కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం



**న్యూఢిల్లీ,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):**ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను మిగతా2లో...

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**● వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం ● విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం ● పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్ ● బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా**



**న్యూఢిల్లీ,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** వాడీవేడీ చర్చలు.. విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన మిగతా2లో...

## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

**ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి**
**చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు**




# పులుల సంరక్షణ మన బాధ్యత

### - భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
### - అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ



**హైదరాబాద్,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు మిగతా2లో...



## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

**- వారి హయాంలోనే కట్టడం..కూలడం చూశాం**
**- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు**
**- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం**
**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో మిగతా2లో...


## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

**పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు**
**మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల**




## టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

**- నకిలీ వెబ్‌సైట్ గుర్తించిన టిటిడి అధికారులు**




**తిరుమల,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేరుతో సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా ఫేక్ వెబ్‌సైట్ రూపొందించి, భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు మిగతా2లో...

## చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ



**అమరావతి,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో తైవాన్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, షెంగ్ హుయ్ టెక్ తదితర మిగతా2లో...



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

**- పర్యావరణ అనుమతులు చెల్లుబాటు**
**- సుప్రీంకోర్టులో ఉపశమనం**

**న్యూఢిల్లీ,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):**తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర మిగతా2లో...

# ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

**● బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు ● హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్**



**హైదరాబాద్,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. మిగతా2లో...

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.

# కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నా మని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహాబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷-లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

**హైదరాబాద్,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్టాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# పులుల సంరక్షణ మన బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రా బాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు.

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించి నట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్ష ణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్ర మాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రా ణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని మంత్రి సురేఖ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్స వం సందర్భ ంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి 'అటవీ సం పదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజా యి తీ, సేవా భావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెల ంగా ణను అందించాలి' అని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

# చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఎయిర్‌పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల పటిష్ఠమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్ తదితర అంశాలను తైవాన్ బృందానికి సీఎం వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అడ్వాన్సుడ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వారికి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తిస్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

**హైదరాబాద్,జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ÷ర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

(మొదటి పేజీ తరువాయి)

నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ÷ూఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ ఫేక్ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నించే భక్తుల నుంచి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఆన్‌లైన్ చెల్లింపులు సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా డిజైన్ చేయడంతో చాలామంది భక్తులు ఇది అసలైన వెబ్‌సైట్‌గా భావించి మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్ల విషయంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ భక్తులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. వేంకటేశ్వరస్వామి దర్శనం, అర్జిత సేవలు, వసతి, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు వంటి అన్ని బుకింగ్‌లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, తెలియని లింకులు, అనధికార వెబ్‌సైట్లను నమ్మొద్దని టీటీడీ అధికారులు సూచించారు. వెబ్‌సైట్ అడ్రస్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా లింకులు కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారులకు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తులు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

# తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి బోర్‌వెల్‌కు రీచార్జ్ పిట్, రైతులకు ఫార్మ్‌పాండ్ ఏర్పాటు చేయాలి**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలి**

**రెండవ విడత అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి**

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్):**భూగర్భ జలాలను పెంపొందించి ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ గ్రామాల్లో తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పిస్తూ వారి అంగీకారంతో పంటకుంటలు (ఫార్మ్‌పాండ్స్) ఏర్పాటు చేయాలని, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ూజూా) పంటకుంటల ఏర్పాటులో ప్రత్యేక చొరవ చూపాలని, ముఖ్యంగా ప్రతి ఆయిల్‌పామ్ రైతు తప్పనిసరిగా ఫార్మ్‌పాండ్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో ప్రతి బోర్‌వెల్ వద్ద రీచార్జ్ పిట్ ఏర్పాటు చేసి భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.మొదటి విడతలో మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు గుడిసెల్లో నివసిస్తున్న అర్హుల కోసం ప్రతిపాదించిన గృహాల వివరాలను రేపటిలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటి స్థల స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు గజాలకు మించకుండా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి 90 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) నరేందర్, డి.ఆర్.డి.ఓ.కాళిందిని ,పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవో లు,సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం అర్హులకే అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ: అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీరాములు

**బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్‌కు తావివ్వొద్దు**

**జూలై 31లోపు ప్రతి రేషన్ కార్డుదారుడి వఖ్‌జ పూర్తి చేయాలి**

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో విజిలెన్స్ సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్**




**పెద్దపల్లి, జూలై-29 (పిసిడబ్ల్యూన్యూస్ ):**జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యాసంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1 నుంచి అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డులోని ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్న బియ్యం, అంత్యోదయ కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో 410 చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలు, బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్ జరగకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 2,46,981 రేషన్ కార్డుల ద్వారా 7,17,898 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని, కొత్తగా 30,909 రేషన్ కార్డులు మంజూరు చేసి 88,357 మంది లబ్ధిదారులను చేర్చినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు నెలల కోటా కింద జిల్లాకు 13,645.968 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 43 ఫెయిర్ ప్రైస్ షాపుల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రతి రేషన్ కార్డుదారుడి వఖ్‌జ ప్రక్రియను జూలై 31లోపు శాతం 100 పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 7,16,498 మంది లబ్ధిదారుల్లో 5,89,738 మంది (82.31 శాతం) ఇప్పటికే వఖ్‌జ పూర్తి చేసుకున్నారని, మిగిలిన వారందరూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 7,490 మంది అనుమానిత లబ్ధిదారుల్లో 4,894 మంది ధృవీకరణ పూర్తయిందని, మిగిలిన వారి ధృవీకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు .ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 62 కేసులపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన 31 కేసుల్లో 579.80 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని రూ. 25.89 లక్షల విలువైన నిల్వలను సీజ్ చేసినట్లు, ఎల్పీజీకి సంబంధించిన 31 కేసుల్లో 45 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 అర్హ కుటుంబాలకు ఇప్పటి వరకు 4,73,691 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి, రూ.1,403.45 లక్షల సబ్సిడీ అందించినట్లు అధికారులు వివరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్,సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం



**పచ్చదనం పెంపే లక్ష్యంగా మొక్కల నాటకం**

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**వేప, కానుగ వంటి**

**మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి**

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎక్సైజ్ శాఖ అధికారి మల్లారెడ్డి**



**తల్లాడ, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తల్లాడ మండల కేంద్రంలోని వైకుంఠధామ సమీపంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, గౌడ్ సంఘం మండల నాయకుడు పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ అధికారి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. గౌడ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం వంటి కార్యక్రమాలు పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యంగా వేప, కానుగ వంటి స్థానిక జాతి మొక్కలను ఎక్కువగా నాటాలని సూచించారు.అనంతరం అతిథులు, గౌడ్ సంఘం సభ్యులు కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), మొక్క తిరుపతి రావు, గుండ్ల నాగయ్య, మొక్క బసవయ్య, సమ్మెట రామకృష్ణ, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ



**పరకాల, జులై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే శానిటేషన్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని బుధవారం రోజు పాత మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతను కాపాడడంలో శానిటేషన్ కార్మికులు నిరంతరం కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వర్షాల సమయంలో విధులు నిర్వహించే క్రమంలో సిబ్బంది తడిసిపోకుండా, అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు రెయిన్‌కోట్లు అందజేశామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం పట్ల మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, భవిష్యత్తులో కూడా వారి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి గంజి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది ఎన్.వి. అనంత కృష్ణకు ఘన సత్కారం



**ఉప్పల్, జులై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఎండోమెంట్ (ధార్మిక) సెల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త ఎన్.వి. అనంత కృష్ణ (అడ్వకేట్) ని జిల్లా కన్వీనర్ బలిజపల్లి చంద్రమౌళి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి పాల్గొని అనంత కృష్ణ విద్యా సేవలను అభినందించారు. గురువు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్య ద్వారా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఎన్.వి. అనంత కృష్ణ ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్తగా విశేష గుర్తింపు పొందారు. ఆన్‌లైన్ ద్వారా దాదాపు 850 మంది విద్యార్థులకు ఉచితంగా బోధిస్తూ, వారి ఉన్నత విద్యాభ్యాసానికి మార్గనిర్దేశనం చేస్తున్నారు. ముఖ్యంగా B.Com మరియు M.A. విద్యార్థులకు బోధిస్తూ, M.A. లోని 16 సబ్జెక్టులను ఉచితంగా బోధించడం ద్వారా విద్యా సేవను సమాజ సేవగా కొనసాగిస్తున్నారు.గురు పౌర్ణమి సందర్భంగా ఇలాంటి మహోన్నత విద్యా సేవకులను సత్కరించడం స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్నవారు కొనియాడారు.

# గురుపౌర్ణమి సందర్భంగా పద్మశ్రీ గ్రహీత సోమ్‌లాల్ నాయక్‌కు ఘన సత్కారం



**ఉప్పల్, జులై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఎండోమెంట్ (ధార్మిక) సెల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త కేతావత్ సోమ్‌లాల్ నాయక్ ని ఎండోమెంట్ జిల్లా కన్వీనర్ బలిజపల్లి చంద్రమౌళి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి, చింతకింది ప్రవీణ్, పడిత్యా నాయక్ తదితరులు పాల్గొని సోమ్‌లాల్ నాయక్ ని అభినందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భువనగిరి మండలం ఆకుతోటబావికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కేతావత్ సోమ్‌లాల్ నాయక్ బంజారా భాషా, సాహిత్య అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించి ఆ భాషా సంస్కృతిని విశ్వవ్యాప్తంగా పరిచయం చేసినందుకు ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మశ్రీ అవార్డు లభించిందని పేర్కొన్నారు.ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించిన సోమ్‌లాల్ నాయక్ సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.గురుపౌర్ణమి సందర్భంగా ఇలాంటి మహనీయులను సత్కరించడం ద్వారా సమాజంలో విద్య, సంస్కృతి, సాహిత్య విలువలను మరింతగా చాటిచెప్పే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం




**హైదరాబాద్ జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషాసాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.

# ప్రభుత్వ విద్యకు గండం గట్టుఎక్కించేది ఎవరు..?

● మసకబారుతున్న ప్రభుత్వ బడులు... మూతపడే దిశగా విద్యాలయాలు..! ● విద్యార్థుల కోసం కోట్ల ఖర్చు... కానీ తరగతి గదుల్లో ఖాళీ బెంచీలు ● ప్రభుత్వమా..? ఉపాధ్యాయులా..? పాలకులా..? తల్లిదండ్రులా..? వైఫల్యం ఎవరిది..? ● ప్రభుత్వ బడులకు గడియారం మోగుతోందా ● ప్రైవేట్ మోజు... ప్రభుత్వ బడులకు శాపమాగా మారిందా...విద్యార్థులు తగ్గిపోతే... ప్రభుత్వ విద్యకు భవిష్యత్తు ఎక్కడ ● బడులు ఉన్నాయి... పిల్లలు లేరు ప్రభుత్వ విద్యకు దండం... గ్రామీణ బడులు వెలవెల ● ఉపాధ్యాయులు ఎక్కువ... విద్యార్థులు తక్కువ ● ప్రభుత్వ బడుల పతనానికి బాధ్యులు ఎవరు ● తల్లిదండ్రుల నిర్ణయమే ప్రభుత్వ బడుల భవితవ్యమా ● ప్రభుత్వ బడులపై నమ్మకం ఎందుకు తగ్గుతోంది ● విద్యపై ప్రైవేట్ ముద్ర... ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యం ● పిల్లల కోసం పథకాలు... కానీ ప్రభుత్వ బడులకు చేరికలు శూన్యం ● గ్రామాల్లో ప్రభుత్వ విద్య క్షీణిస్తోంది... అధికార యంత్రాంగం మేల్కొంటుందా ● కల్లూరు మండలంలో ఆందోళనకర పరిస్థితి ● విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది క్షీణిస్తోంది ● కోట్లాది రూపాయల ఖర్చు... ఆశించిన ఫలితాలు కరువు ● అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల సమిష్టి బాధ్యత అవసరం ● ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకురావాలంటే తక్షణ చర్యలే మార్గం

**కల్లూరు, జూలై 29 (పిసిడబ్ల్యూన్యూస్) :** ఒకప్పుడు గ్రామీణ సమాజానికి విజ్ఞాన నిలయాలుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలలు నేడు విద్యార్థుల కొరతతో మనుగడ కోసం పోరాడుతున్నాయి. ముఖ్యంగా కల్లూరు మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏడాది ఏడాదికి గణనీయంగా తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో భవనాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్కాలర్‌షిప్‌లు, డిజిటల్ తరగతులు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిగిన శాశ్వత ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, అనేక ప్రైవేటు పాఠశాలల్లో తక్కువ వేతనాలతో, పరిమిత అర్హతలతో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపడం అనేక ప్రశ్నలకు




తావిస్తోంది. ఆంగ్ల మాధ్యమం, క్రమశిక్షణ, ప్రచారం, మార్కెటింగ్, సామాజిక ప్రతిష్ఠ వంటి అంశాలు ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా మారాయి. దీని ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి, కొన్ని చోట్ల ఒక్క అంకెలకే పరిమితమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పాఠశాలల విలీనాలు, మూసివేతలు పెరిగే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. అధికార యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలు ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలలను తరచూ సందర్శించి విద్యా ప్రమాణాలను సమీక్షించాలి. ప్రతి ఉపాధ్యాయుడు గ్రామస్థాయిలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలను వివరించాలి. ఆంగ్ల మాధ్యమ బోధన, డిజిటల్ విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి గ్రామ పంచాయతీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని ప్రాధాన్య అంశంగా తీసుకోవాలి. పాఠశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత వంటి మౌలిక వసతులు మెరుగుపరచాలి. **ప్రజాప్రతినిధుల బాధ్యత ఏమిటి..?** సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థుల చేరికకు కృషి చేయాలి. ప్రతి విద్యా సంవత్సరం గ్రామ స్థాయిలో ప్రభుత్వ బడికి బంగారు భవిష్యత్తు వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలి. **విద్యావేత్తల సూచనలు** ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో అనుసంధానం చేయాలని విద్యావేత్తలలో కొందరు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు అన్ని వర్గాల పిల్లలకు సమాన విద్యా అవకాశాలు, చట్టపరమైన హక్కులు, సామాజిక ప్రభావాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. **పరిష్కారం ఒక్కటే... ప్రభుత్వ బడుల బలోపేతం** ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, నాణ్యమైన బోధన, ఆధునిక వసతులు, జవాబు దారీతనం, తల్లిదండ్రులతో నిరంతర అనుసంధానం ద్వారా మాత్రమే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే ప్రభుత్వ విద్యా వ్యవస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ బడి బలపడితేనే సమాజం బలపడుతుంది. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడం అందరి బాధ్యత.

# నకార స్ఫూర్తితో హక్కుల పోరుకు సిద్ధం కావాలి !

**- జీవితాంతం సేవ చేసిన వృద్ధాప్యంలో పెన్షనర్లకు కన్నీళ్లే మిగిల్చుతారా?**

**- హెల్త్ కార్డుల నిర్లక్ష్యంతో గాలిలో కలుస్తున్న నిండు ప్రాణాలు**

**- రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్ జిఆర్ఈఏ) ఆవేదన**





**ఖమ్మం ప్రతినిధి, జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశం కోసం, సమాజంకోసం తమ జీవితాంతం రక్తం చెమటగా మార్చి సేవలు అందించిన రిటైర్డ్ ఉద్యోగులను, పెన్షనర్లను నేటి ప్రభుత్వాలు నిర్దయగా విస్మరిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని పెన్షనర్స్ భవన్లో ధర్మసూద్ నకార వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన నకారా వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ... నకార పోరాడి సాధించుకున్న పెన్షన్ హక్కులను నేడు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. వృద్ధాప్యంలో ఆసరాగా నిలవాల్సిన పెన్షన్ ప్రయోజనాలను సకాలంలో అందించకుండా, పెన్షనర్ల మధ్య ఉన్న అనైక్యతను ఆసరాగా చేసుకుని కాలయాపన చేస్తూ వారిని తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. **ఆరోగ్య కార్డుల జాప్యం నిండు ప్రాణాలకు శాపం!** వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రుల చుట్టూ తిరిగే వయసులో పెన్షనర్లకు దక్కాల్సిన వైద్య సదుపాయాలపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం దారుణమని ఆయన పేర్కొన్నారు. గత రెండు నెలలుగా పెన్షన్ నుండి డబ్బులు మినహాయించుకున్నప్పటికీ, నేటికీ ఆరోగ్య కార్డులు జారీ చేయకపోవడం దారుణం అన్నారు. హెల్త్ కార్డులు జారీ చేసే వెబ్సైట్ సరిగ్గా పనిచేయకపోవడం, నిర్దిష్ట మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం, ఆసుపత్రుల జాబితాను ప్రకటించకపోవడంతో పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్యాన్ని అమలు చేయకపోవడంతో సరైన సమయానికి వైద్యం అందక అనేకమంది వృద్ధుల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ, హామీలను నీరుగారుస్తున్న ప్రభుత్వ వైఖరిపై పెన్షనర్లందరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. నకార ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. పూర్ణచందర్రావు, జిల్లా కార్యదర్శి టి. జనార్ధన్, నగర శాఖ నాయకులు ఎస్. సత్యనారాయణ, రమణ యాదవ్, వెంకటేశ్వర్లు, ఎం. శంకర్రావు, సిహెచ్. రాంబాబు, రామస్వామి, కృష్ణమూర్తిలు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# వీవో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ





**మానకొండూర్ జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న వీవో భవనం పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి వీవో భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ వీవీ వరలక్ష్మి, స్థానిక సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు గౌడ్, వైస్ చైర్మన్, రామిడి తిరుమల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, కోండ్ర సురేశ్, రఘు,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్లు లేని కబోధిలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**తిమ్మాపూర్ జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్ల ముందు కదలాడుతున్నా ప్రతిపక్షాలకు కానరాక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని మానకూండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశమందిరంలో వివిధ గ్రామాల 99 మంది లబ్ధిదారులకు 31.92 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయని బీఆర్ఎస్, దానికి వంతపాడుతూ అంటకాగిన బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పథకాలపై తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గత పాలనలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసి చేతులు దులుపుకున్న విషయాన్ని విస్మరించిన గులాబీ నేతలు 2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల 2 లక్షల రుణమాఫీ పొందడంలో కొద్ది మంది రైతులకు ఆలస్యం జరిగిందే తప్ప మరో ఉద్దేశం కాదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డబుల్



బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం చేతకాని గత పాలకులు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగునా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు కోసం మోదీ ప్రభుత్వ సాయాన్ని కోరాలన్న సోయి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బేషజాలను పక్కనబెట్టి జనహితం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు మోడీని కలిసి లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ధరణి పేరిట జరిగిన అక్రమాలు అన్నీ,ఇన్నీ కావని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యుల పరమయ్యాయని, భూముల ఆక్రమణలు, కబ్జాలకు అడ్డూఅదుపూ



లేకుండా పోయాయని, వాస్తవాలను ఇప్పటికైనా గ్రహించి బట్టకాల్చి మీద వేసే విధానానికి గులాబీనేతలు స్వస్తిపలకాలని డాక్టర్ కవ్వంపల్లి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి కుటుంబం నెలకు 2500 రూపాయల మేరకు లబ్ధిపొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదాహరణంగా వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అష్టకష్టాలకు, అన్యాయాలకు గురిచేయడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారన్నారు. ప్రజల ఆశలు,ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రైతులు పండించిన వరి,మక్కజొన్న,సన్ ఫ్లవర్ తదితర పంటలను ప్రభుత్వం ఐకేపీ, సింగిల్ విండో వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయించడమే కాకుండా 24 గంటలకు రైతులకు డబ్బులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కిలో సన్న బియ్యాన్ని 60 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పవన్ కుమార్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కొత్త తిరుపతిరెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, నోముల అనిల్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, లక్ష్మణ్, తుర్తి అరవింద్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేళ బ్రహ్మర్షి గూడ జగదీశ్వర శర్మను ఘనంగా సత్కరించిన బీజేపీ...

- గురువులు జీవితానికి అందించే మార్గదర్శకత్వం మరువలేనిది..
- గురువుల రుణం తీర్చుకోలేనిది: బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్ జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని వీణవంక బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఇట్టి వేడుక లకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ప్రముఖ వేద పండితులు, ఆధ్యాత్మిక గురువు బ్రహ్మర్షి గుడా జధీశ్వర శర్మ ఘనంగా సన్మానించి, పాద ప్రణామం చేశారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గురువుల గొప్పతనాన్ని, సమాజంలో వారి ప్రాముఖ్యతను ఆయన కొనియాడారు.భారతీయ సనాతన సంప్రదాయంలో తల్లిదండ్రుల తర్వాత అంతటి స్థానం గురువులదేనని, వారు సమాజానికి దిశానిర్దేశం చేస్తారని గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. "గురువుల ద్వారా మనం పొందే విజ్ఞానం, సంస్కారం అమూల్యమైనవని ,గురువులు మన జీవితానికి అందించే మార్గదర్శకత్వం మరువలేనిది. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు.సనాతన ధర్మాన్ని, వేద విద్యలను భావితరాలకు అందిస్తూ సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంలో వేద పండితుల పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. బ్రహ్మర్షి గుడా జధీశ్వర శర్మ వంటి మహనీయుల ఆశీస్సులు సమాజానికి శ్రీరామరక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వీణవంక బిజెపి నేతలు సిహెచ్ నరసింహ రాజు, పెద్ది మల్ల రెడ్డి ,ముత్యాల రవీందర్ కొమ్మటి శ్రీనివాస్ రెడ్డి ,తాళ్లపల్లి నాగరాజు, ఉడుత కుమార్, అప్పని కొమురయ్య, పుప్పాల రఘు, చర్ల రాజు, దాసరి భాస్కర్, అశోక్ ,సంతోష్ ,బాపన , దాట్ల వీరస్వామి అడిచర్ల రాజు, హరికృష్ణ లతోపాటు ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బుద్ధ మహేందర్ గుప్త, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, జిల్లా ధార్మిక సెల్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గురువులను పూజించే సంస్కారం నేర్చుకోవాలి....


**- కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్.**



**కరీంనగర్ జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** గురువులను పూజించే సంస్కారాన్ని ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్బంగా బుధవారం కరీంనగర్ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా వ్యాస భగవానుని చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనగావించి గురుపౌర్ణమి వేడుకలు నిర్వించారు. అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఏ రంగం లోనైనా రాణించాలంటే గురువు తప్పనిసరని తెలిపారు. న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే వారంతా కూడా ఒక మంచి గురువును ఎంచుకుని వృత్తిలో నిష్ణాతులు కావాలని సూచించారు. న్యాయవాద వృత్తిలో 50 ఏళ్ల ప్రాక్టీస్ పూర్తి చేసుకున్న హన్మంతరావు,జీ. నారాయణ రెడ్డి, కే. మాదవరావు, కల్వకుంట్ల మనోహర్ రావ్ లను శాలువాలతో సన్మానం చేసి జ్ఞాపిక ను అందించారు. ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు బొడ్ల గీతారాణి, బండ శివకుమార్, సాంస్కృతిక కార్యదర్శి బెజ్జెంకి శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ సుంకె దేవకిషన్, కమిటీ సభ్యులు మూడపల్లి అనురాద, చెల్లోజు భూమాచారి,బొజ్జ స్వామి కరుణశ్రీ,సీనియర్ న్యాయవాదులు కుసుంబ కృష్ణారావ్, తుమ్మనపల్లి లక్ష్మణ్ రావ్,కూర శ్రీనివాస్ రెడ్డి, తిరునగరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## యజ్ఞ వరాహస్వామి ఆలయ వెబ్‌సైట్ ప్రారంభం.. డిజిటల్ సేవలతో భక్తులకు మరింత సౌలభ్యం..





**కరీంనగర్, జూలై 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని ప్రముఖ యజ్ఞ వరాహస్వామి దేవాలయంలో ఆలయానికి సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా దేవాలయ నిర్వహణ మరింత పారదర్శకంగా ఉండటంతో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని అన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆలయంలో నిర్వహించే పూజలు, ఉత్సవాలు, ప్రత్యేక సేవలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను భక్తులు సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు.దేవాలయ అభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆయన, భక్తులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ఇటువంటి డిజిటల్ కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, కార్పొరేటర్ తోట అనిల్, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.వెబ్‌సైట్ ప్రారంభించినందుకు దేవాలయ కమిటీ సభ్యులు మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## భారీ వర్షాలపై అప్రమత్తం.. లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**- డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం..**



**కరీంనగర్,జూలై29(పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను పరిశీలించేందుకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. టూ టౌన్ సమీపంలోని నాలా, మంచిర్యాల్ చౌరస్తా నాలా, వి-పార్క్ సమీపంలోని నాలాతో పాటు పలు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కొనసాగుతున్న డ్రైనేజీ, వరద నీటి పారుదల పనుల పురోగతిని పరిశీలించిన మేయర్, పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు.నగరంలోని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట అదనపు యంత్రాంగాన్ని వినియోగించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ స్పష్టం చేశారు.రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న పాత మట్టి ఇళ్లలో నివసిస్తున్న వారు తమ భద్రత కోసం సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు.43వ డివిజన్‌లో గోడ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడిన ఘటనలో జేసీబీ సహాయంతో గోడను పూర్తిగా తొలగించి ప్రమాదాన్ని నివారించినట్లు మేయర్ తెలిపారు. నగరంలోని ఇతర ప్రమాదకర భవనాలు, శిథిల గోడలను కూడా గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో నగర ప్రజలు మున్సిపల్ కాల్ సెంటర్ 98499 06694కు లేదా తమ డివిజన్ కార్పొరేటర్‌ను సంప్రదించాలని మేయర్ సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పొన్నం లక్ష్మీ మొండయ్య, సునావత్ భాస్కర్ నాయక్‌తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీసు కమీషనరేట్ రామడుగు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం





**రామడుగు జూలై 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రామడుగు పోలీసు స్టేషన్‌ను బుధవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా (సర్ప్రైజ్ విసిట్) తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధుల గురించి అడిగారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు.తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా అందుబాటులోకి తెచ్చిన:సీసీటీఎన్ఎస్ - 2.0 పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలుటీఎస్-కాప్ , హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్ సైబర్ క్రైమ్ ఆర్థిక/ఆర్థికేతర నేరాల సాఫ్ట్‌వేర్, సీడీఆర్ వంటి అన్ని రకాల అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని సూచించారు. స్టేషన్‌కు కేటాయించిన వస్తువులను పరిశీలించడంతో పాటు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌ను ఉపయోగిస్తున్న తీరును తనిఖీ చేశారు.ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు తెలుసుకుంటూ, విసిబుల్ పోలిసింగ్ (విజిబుల్ పోలీసింగ్) పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, రామడుగు ఎస్సై రాజులతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం నుంచి జలాలు.. మానేరు డ్యామ్‌కు జలకళ

**- నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ప్రారంభం.. రైతుల్లో కొత్త ఆశలు**



**కరీంనగర్ జిల్లా జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు నేడు ప్రారంభం కావడంతో కరీంనగర్ జిల్లా రైతుల్లో ఆశలు చిగురించాయి. పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తుండటంతో కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ కు జలకళ సంతరించుకుంది.ఇటీవల కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్‌ను సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌ల మోటార్లను వెంటనే ప్రారంభించి మానేరు డ్యామ్‌ను నీటితో నింపాలని ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ప్రారంభం కావడంతో గోదావరి జలాలు మానేరు డ్యామ్ వైపు తరలుతున్నాయి. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సాగునీటి అవసరాలకు భరోసా కలగడంతో పాటు ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు పెరిగాయి.మానేరు డ్యామ్‌కు నీరు చేరుతుండటంతో కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో జలకళ కనిపిస్తోంది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. కాళేశ్వరం జలాలను సమర్థవంతంగా వినియోగించి మానేరు డ్యామ్‌ను పూర్తి స్థాయిలో నింపి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపును కొనసాగించాలని, మానేరు డ్యామ్‌ను నింపి ఖరీఫ్ సాగుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

## సర్ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే సమర్పించాలి: కమన్ పిలుపు



**కరీంనగర్, జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** సర్-2026 గడువు ముగియడానికి కేవలం ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, అర్హులైన ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీూఓ)కు వెంటనే సమర్పించాలని కరీంనగర్ అలైడ్ ముస్లిం అసోసియేషన్స్ అండ్ ఎన్‌జీఓస్ నెట్‌వర్క్ కమన్‌పిలుపునిచ్చింది.కమన్ ఆధ్వర్యంలోని అదలా యాక్సెస్ టు జస్టిస్ నెట్వర్క్, దారుల్ ఖైర్, ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో, 2002 సర్ లెగసీ వివరాలు అందుబాటులో లేకపోయినా ఫారం సమర్పణను వాయిదా వేయకుండా, వ్యక్తిగత వివరాలతో మూడవ కాలమ్ నింపి వెంటనే సమర్పించాలని సూచించారు. అనంతరం విచారణ సమయంలో లెగసీ వివరాలను సమర్పించవచ్చని తెలిపారు.చివరి రోజుల్లో భారీ సంఖ్యలో ఫారాలు సమర్పిస్తే బిఎల్ఒలపై పనిభారం పెరుగుతుందని, అందువల్ల ముందుగానే ఫారాలు సమర్పించాలని కోరారు. అలాగే ఫారం సమర్పించిన అనంతరం తప్పనిసరిగా రసీదు తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు.

రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను వెంటనే పొందాలని, SIR-2026లో ఇది ఆమోదయోగ్యమైన పత్రాల్లో ఒకటిగా ఉపయోగపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించి గడువులోపు ఫారాల సమర్పణకు సహకరించాలని ఖాూహీూచీ విజ్ఞప్తి చేసింది.

# గురుపౌర్ణమినాడు కొండగట్టు గిరిప్రదక్షిణ - రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం ప్రార్థనలు

**సకలజనుల సంక్షేమమే లక్ష్యంగా కొండగట్టు గిరిప్రదక్షిణ: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**భారీ వర్షంలోనూ కొండగట్టు గిరిప్రదక్షిణ పూర్తి చేసిన మంత్రులు పొన్నం, అడ్లూరి లక్ష్మణ్**

**ఎల్-నినో ప్రభావం తొలగి రైతులు సుభిక్షంగా ఉండాలని కొండగట్టు అంజన్నకు మొక్కులు**

**43వ కొండగట్టు గిరిప్రదక్షిణ - లోక కళ్యాణం కోసం ప్రత్యేక పూజలు - మంత్రి పొన్నం ప్రభాకర్**









**కొండగట్టు జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సంక్షేమం కోసం వర్షాలు సమృద్ధిగా పడాలని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని నేడు గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంఆధ్వర్యంలో కొండగట్టు గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన కుమార్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, అంజన్న భక్తులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా కాంగ్రెస్ నేతలు, భక్తులు కొండగట్టు గిరిప్రదక్షిణను పూర్తి చేసి, అనంతరం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ...మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోరుతూ రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, "ఎల్-నినో వైపరీత్యం ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గతంలో హైదరాబాద్ లాల్ దర్వాజా అమ్మవారు వేములవాడ రాజన్న ఆలయం కొండగట్టు అంజన్న ఆలయం ఇలా ఏ పుణ్యక్షేత్రంలో అయినా ఇలాంటి విపత్తుల సమయంలో ప్రజలు నమ్ముకున్న దేవుళ్ళు వారిని రక్షించారు, 43 వ సారి పౌర్ణమి రోజున జరుగుతున్న ఈ గిరి ప్రదక్షిణ సందర్భంగా వర్షాలు కురవాలని, పంటలు సుభిక్షంగా పండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని లోక కళ్యాణం కోసమే కొండగట్టు అంజన్నను ప్రార్థించాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని జిల్లా అభివృద్ధి కోసం మేమంతా ఎప్పుడు కలిసే పని చేస్తామని ఇది ఏ పార్టీకి, ఏ వర్గానికి సంబంధించిన కార్యక్రమం కాదు. సకలజనుల సంక్షేమం కోసం చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమం అని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. కొండగట్టు క్షేత్రాన్ని కూడా మరింత అభివృద్ధి చేస్తాం."ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ "రైతుల కష్టాలు తీరాలని, రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖంగా ఉండాలని ఆధ్యాత్మిక భావనతో ఈ గిరిప్రదక్షిణ చేపట్టాం. కొండగట్టు అంజన్న ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను. భారీ వర్షంలోనూ పాల్గొన్న ప్రతి భక్తుడికి, కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. పెద్ద ఎత్తున జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సర్పంచులు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు సహకార సంఘాల చైర్మన్లు మార్కెట్ కమిటీ చైర్మన్ లు పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఇతర ముఖ్య నేతలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూసి కలుషిత జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు



**500 ఎకరాల సన్నకారు రైతుల ఆవేదనను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి**

**బీఎస్పీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్**

**రామన్నపేట, జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):**మూసి కలుషిత జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని బిఎస్పి భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి కత్తుల కాన్షీరామ్ అన్నారు. బుధవారం మండలంలోని మునిపంపుల గ్రామకంఠం గుండా వెళ్లే ఆసిఫ్‌నగర్ కాలువ (మూసి కాలువ) ను బహుజన సమాజ్ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం నుండి విడుదలయ్యే కలుషిత మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు మూసి ద్వారా నాగారం, తుమ్మలగూడెం, శోభనాద్రిపురం, నీర్నెముల, దుబ్బాక గ్రామాల మీదుగా ఈ ప్రాంతానికి చేరి ఆసిఫ్‌నగర్ కాలువలో ప్రవహిస్తునందున ఈ కలుషిత నీటితోనే రైతులు వరి, కూరగాయ పంటలు, ఇతర పంటలు చేయాల్సి వస్తుంది. దీనివల్ల నేలసారం దెబ్బ తినడమే కాకుండా, పండే పంటలు కూడా కలుషితమై రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అంతేకాకుండా పశువులు, గొర్లు, మేకలు, ప్రజల ఆరోగ్యానికీ తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. ఈ నీటిని తాకడానికే ప్రజలు భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని, బట్టలు ఉతకడానికి కూడా ఉపయోగించలేని స్థాయిలో కాలుష్యం ఉందని తెలిపారు. మునిపంపుల గ్రామ పరిధిలో ఈ కాలువకు అవతల ఉన్న సుమారు 500 ఎకరాల సన్నకారు రైతుల భూములకు చేరుకోవాలంటే రైతులు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోందన్నారు. ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన రైతులు ఎకరం, రెండు ఎకరాలు, అర ఎకరం వంటి చిన్న భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారి జీవనాధారం ఈ సమస్యతో ప్రమాదంలో పడిందన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ఈ కాలువలో నీటి ప్రవాహం మరింత ఉధృతంగా మారి రైతులు, వ్యవసాయ కూలీలు కాలువ దాటలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. కలుషిత జలాల కారణంగా పాములు, విషజంతువులు అధికంగా సంచరిస్తుండటం తో రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ కాలువపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారాలు మారినా రైతుల కష్టాలు మాత్రం మారలేదని, హామీలు మాత్రమే మిగిలాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యను పరిష్కరించకపోతే బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మండల, జిల్లా స్థాయిలో ఆందోళనలు నిర్వహించడంతో పాటు ఇరిగేషన్ శాఖ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట శాంతియుత ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే ఈ సమస్యను రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు గ్యార శేఖర్, నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పావురాల నరసింహ యాదవ్, మండల నాయకులు బెల్లి మల్లయ్య గౌడ్ పాటు స్థానిక రైతులు, రాములమ్మ ,లింగయ్య వెంకన్న సైదులు పాపయ్య రేణుక నిర్మలా ఎల్లమ్మ మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ




**మహాదేవాపూర్ జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ, సిబ్బంది విధి నిర్వహణను పరిశీలించి, అన్ని రికార్డులను క్రమం తప్పకుండా నవీకరిస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించిన ఆయన, వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెద్దవంగర మండల పిఆర్‌టీయు టీఎస్. నూతన కార్యవర్గ ఎన్నిక

**- అధ్యక్షులుగా గంగిశెట్టి రమేష్ , ప్రధానకార్యదర్శి మహమ్మద్ యాకుబ్ పాషా**



**పెద్దవంగర జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** పి ఆర్ టీ యు టీ ఎస్ మండల శాఖ కార్యవర్గ ఎన్నిక జరిగింది ఈ ఎన్నికలో మండల అధ్యక్షులుగా గంగిశెట్టి రమేష్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ యకూబ్ పాషా ఎన్నుకోవడం జరిగింది. అసోసియేట్ అధ్యక్షులు గా టీ విద్యా సాగర్, మహిళా అసోసియేట్ అధ్యక్షులు గా ఎం వాణి, ఎం మహబూబీ ఉపాధ్యక్షులుగా . బాలరాజు, . ఉపేందర్, మహిళా ఉపాధ్యక్ష లు గా . రజిత, . హైమ, కార్యదర్శి.రవి, మహిళా కార్యదర్శి గా . ఉమా దేవి ఎన్నిక కావడం జరిగింది. ఈయొక్క కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్ రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 లోపు అందరి ఉద్యోగ ఉపాధ్యాయులను ఓ పి ఎస్ లోకి తీసుకురాకుంటే ఉద్యమ కార్యాచరణ చేపడుతామని తెలిపారు. పెండింగ్ డి ఎ లు, పి ఆర్ సి లు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాగర్ల ముడి శ్రీధర్, కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్ రెడ్డి, . చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లొ శ్రీనివాస్ రెడ్డి, వేణు మాధవ్, విద్యా సాగర్, .అంజయ్య, . రవి, . వెంకట శ్రీనివాస్, . బాలరాజు, వెంకటేశ్వర్లు, మహబూబ్ అలీ, వెంకటేశ్వర్లు, వాణి, ఉమాదేవి, రజిత, తదితరులు పాల్గొన్నారు

# గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఘనంగా గురు పూజోత్సవం




**చౌటుప్పల్,జూలై 29(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గురు పూజోత్సవాన్ని చౌటుప్పల్‌లోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలు అందించి, పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో విద్యార్థులు గురువుల గొప్పతనం, గురు-శిష్య సంబంధం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గురించి ప్రసంగాలు చేసి, పాటలు ఆలపించి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల తర్వాత జీవితానికి సరైన దిశను చూపించే వారు గురువులేనని అన్నారు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని, విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పించే గురువుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సాదుపల్లి లక్ష్మి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని గురువులకు శుభాకాంక్షలు తెలియజేసి, గురు పూజోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



# వన్డే ఫార్మాట్‌లో గిల్ మళ్లీ నంబర్ 1




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రెండు హాఫ్ సెంచరీలు సాధించిన గిల్.. ఒక స్థానం మెరుగుపరుచుకుని మళ్లీ నంబర్ 1 స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం గిల్ ఖాతాలో 801 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 794 పాయింట్లతో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ రెండో స్థానానికి పడిపోయాడు. భారత స్టార్లు విరాట్ కోహ్లీ (767), రోహిత్ శర్మ (758) వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే 15 ఏళ్ల బిహార్ కుర్రాడు వైభవ్ సూర్యవంశీ అద్భుతం చేశాడు. జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో అద్భుతంగా రాణించి 151 పరుగులు చేయడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా 230 స్థానాలు ఎగబాకిన వైభవ్, ప్రస్తుతం 536 రేటింగ్ పాయింట్లతో 48వ స్థానంలో నిలిచినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. మరో భారత ఆటగాడు ఇషాన్ కిషన్ 910 పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జింబాబ్వేపై 60 పరుగులతో అజేయంగా నిలిచిన భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ రెండు స్థానాలు పైకి ఎగబాకి ఆరో స్థానానికి చేరుకోగా, నిరాశపరిచిన అభిషేక్ శర్మ ఒక స్థానం కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అజేయంగా అర్ధశతకం సాధించిన పాకిస్థాన్ కొత్త కెప్టెన్ బాబర్ ఆజం నాలుగు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పాక్ బౌలర్ మహ్మద్ అబ్బాస్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 17వ స్థానానికి చేరుకోగా, వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 24వ ర్యాంకుకు చేరుకున్నాడు. విండీస్ బౌలర్ షమర్ జోసెఫ్ ఆరు స్థానాలు కిందకు పడిపోయాడు. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ 10 స్థానాలు ఎగబాకి 26వ స్థానానికి చేరుకున్నాడు. అయితే, భారత బౌలర్లు వరుణ్ చక్రవర్తి (మూడు స్థానాలు), జస్ప్రీత్ బుమ్రా (ఐదు స్థానాలు), అర్షదీప్ సింగ్ (ఎనిమిది స్థానాలు) తమ ర్యాంకులను కోల్పోయారు.

# సత్తా చాటిన హర్జిందర్ కౌర్, గుల్వీర్ సింగ్






కామన్వెల్త్ క్రీడల్లో హర్జిందర్ కౌర్, గుల్వీర్ సింగ్ రజతం గెలుచుకున్నారు. భారత బాక్సర్లు ముందంజ వేసి, మరిన్ని పతకాలను ఖాయం చేసుకున్నారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో ఆరవ రోజు భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి వెయిట్‌లిఫ్టర్ హర్జిందర్ కౌర్, లాంగ్-డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ దేశానికి రెండు అత్యుత్తమ రజత పతకాలను అందించారు. అదే సమయంలో ముగ్గురు భారత బాక్సర్లు సెమీఫైనల్స్‌లోకి అడుగుపెట్టి, భారత్‌కు మరో మూడు పతకాలను ఖాయం చేశారు. మహిళల 69 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు ఉన్న హర్జిందర్ కౌర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ఆమె స్నాచ్ విభాగంలో ముందుగా 99 కేజీలు ఎత్తి ఆ తర్వాత దానిని 101 కేజీలకు మెరుగుపరుచుకుంది. క్లీన్ అండ్ జెర్క్‌లో కూడా 123 కేజీలు, 126 కేజీలు ఎత్తి గేమ్స్ రికార్డులను బద్దలు కొట్టింది. మొత్తంగా 227 కేజీల బరువును విజయవంతంగా ఎత్తి, భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏడవ పతకాన్ని అందించింది. అయితే, కెనడాకు చెందిన షార్లెట్ సిమోనో మొత్తం 240 కేజీల బరువును ఎత్తి ఆధిపత్యం చెలాయించి స్వర్ణం గెలుచుకుంది. పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో ఆసియా క్రీడల కాంస్య పతక విజేత గుల్వీర్ సింగ్ సంచలనం సృష్టించాడు. భారీ వర్షం, ట్రాక్ నిండా నీరు ఉన్నప్పటికీ అద్భుతమైన పోరాట పటిమ కనబరిచాడు. 27 నిమిషాల 49.78 సెకన్ల వ్యవధిలో రేసును పూర్తి చేసి, స్వర్ణ పతక విజేత క్రై రాబిన్సన్ (27:48.93) కంటే కేవలం 0.85 సెకన్ల వెనుకంజలో నిలిచి రజత పతకం సాధించాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారతీయుడిగా గుల్వీర్ సింగ్ సరికొత్త చరిత్రను లిఖించాడు. మహిళల 60 కేజీల విభాగంలో ఆసియా ఛాంపియన్ ప్రియా ఘంఘాస్ ఆతిథ్య క్రీడాకారిణి నియామ్ మిచెల్‌పై 4-1 తేడాతో అద్భుతమైన కమ్‌బ్యాక్ విజయాన్ని సాధించింది. 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ 5-0 తేడాతో నికోల్ క్లైడ్‌ను, పురుషుల 55 కేజీల విభాగంలో జదుమణి సింగ్ జాంబియా బాక్సర్‌ను మట్టికరిపించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దీని ద్వారా భారత్‌కు కనీసం 3 పతకాలు ఖరారయ్యాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో పర్వీన్ హుడా (2-3), కపిల్ పోఖరియా (90 కేజీలు) తీవ్రంగా పోరాడి ఓటమి పాలయ్యారు. పురుషుల 400 మీటర్ల పరుగులో జాతీయ రికార్డ్ హోల్డర్ విశాల్ టీకే 46.49 సెకన్లలో తన లక్ష్యాన్ని చేరుకుని సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. 45 సెకన్ల లోపు పరుగెత్తిన తొలి భారతీయుడిగా (44.98 సెకన్లు) రికార్డు ఉన్న విశాల్, హీట్ సిక్స్‌లో రెండో స్థానంలో నిలిచి సెమీస్ చేరాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో మహిళల 48 కేజీ వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను గోల్డ్ గెలిచి, వరుసగా మూడోసారి కామన్‌వెల్త్ గోల్డ్ సాధించింది. ఇది ఆమెకు చారిత్రాత్మక హ్యాట్రిక్. ఐతే.. ఇది జులై 26న వచ్చిన గోల్డ్. జూలై 28న భారత్‌కు కొత్తగా గోల్డ్ మెడల్ రాలేదు.

# వెస్టిండీస్ పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయం

- వెస్టిండీస్ చేతిలో 90 పరుగుల తేడాతో పాకిస్థాన్ చిత్తు
- డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో పాతాళానికి పాక్




వెస్టిండీస్ పర్యటనను పాకిస్థాన్ ఘోర పరాజయంతో ప్రారంభించింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా జరుగుతున్న రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ శుభారంభం చేయలేకపోయింది. మంగళవారం ముగిసిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన వెస్టిండీస్ 90 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. పూర్తిగా పేస్ ఆధిపత్యం నడిచిన ఈ మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్లే 40 వికెట్లు పడగొట్టారు. 211 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 120 పరుగులకే కుప్పకూలింది. వెస్టిండీస్ పేసర్ జైడెన్ సీల్స్(5/20) ఐదు వికెట్లతో పాక్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేయగా.. పాకిస్థాన్ 282 పరుగులకు ఆలౌటైంది. 29 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన వెస్టిండీస్ 181 పరుగులకు ఆలౌటైంది. దాంతో పాక్ ముందు 211 లక్ష్యం నమోదు కాగా.. పాక్ ఛేదించలేకపోయింది. విదేశాల్లో పాకిస్థాన్‌కు ఇది వరుసగా 8వ ఓటమి. ఈ ఘోర పరాజయంతో డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో పాకిస్థాన్ పాతాళానికి పడిపోయింది. ఈ డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో ఇప్పటి వరకు 5 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన పాక్.. ఒకే ఒక్క విజయం, 6.66 విన్నింగ్ పర్సంటేజీతో అట్టడుగు స్థానంలో నిలిచింది. వెస్టిండీస్ 11 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 22.73 విజయాల శాతంతో 8వ స్థానంలో కొనసాగుతోంది. భారత్ 9 మ్యాచ్‌ల్లో 4 గెలిచి, ఒకటి డ్రా చేసుకొని 48.15 విన్నింగ్ పర్సంటేజీతో ఐదో స్థానంలో నిలిచింది. 8 మ్యాచ్‌ల్లో 7 విజయాలు, 87.50 విన్నింగ్ పర్సంటేజీతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా..4 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, 75 విన్నింగ్ పర్సంటేజీతో సౌతాఫ్రికా రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 72.22 విన్నింగ్ పర్సెంటేజీతో మూడో స్థానంలో కొనసాగుతుండగా.. 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 58.33 విజయాల శాతంతో నాలుగో స్థానంలో నిలిచింది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే శ్రీలంకతో రెండు టెస్ట్ సిరీస్‌లతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై విజయాలు సాధించాలి.



# దులీప్ ట్రోఫీ 2026 ఈస్ట్ జోన్ జట్టు ప్రకటన

**జట్టు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ నియామకం**

**వైస్ కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ ఎంపిక!**




భారత ప్రతిష్టాత్మక దేశీయ క్రికెట్ టోర్నీమెంట్ అయిన దులీప్ ట్రోఫీ 2026 కోసం ఈస్ట్ జోన్ జట్టును ప్రకటించారు. యువ ఆటగాళ్లతో కూడిన ఈ జట్టుకు వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించగా.. 15 ఏళ్ల యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. చిన్న వయసులోనే ఇలాంటి కీలక బాధ్యతను స్వీకరించడం.. మరో పాత్రలో తనను తాను నిరూపించుకోవడానికి వైభవ్ సూర్యవంశీకి ఓ అవకాశంగా నిలుస్తుంది. గత సంవత్సరం ప్రకటించిన తూర్పు జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఎంపిక కాగా.. అతడికి ఇంతకు ముందు కూడా కెప్టెన్ గా చేసిన అనుభవం కూడా ఉంది. గతేడాది ఇషాన్ కిషన్ ఫైనల్‌లో హర్యానాను 69 పరుగుల భారీ తేడాతో ఓడించి.. జార్ఖండ్‌కు వారి మొదటి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టైటిల్‌ను అందించాడు. పాట్ కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ ఐపీఎల్ 2026లోని మొదటి ఏడు మ్యాచ్‌లలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కూడా నాయకత్వం వహించాడు. మరోవైపు 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశి వైస్ కెప్టెన్‌గా ఎంపిక కావడం ఈ జట్టుకు ఓ చెప్పుకోదగ్గ విజయం. వైభవ్ సూర్యవంశీ దక్షిణాఫ్రికా పర్యటనలో భారత అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి సిరీస్ విజయాన్ని అందించాడు. వైభవ్ తన కొత్త బాధ్యతను ఎలా నిర్వహిస్తాడో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. భారత ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్‌లను బౌలింగ్ విభాగంలోకి చేర్చారు. ఈ ఇద్దరు బౌలర్లకు అంతర్జాతీయ క్రికెట్ అనుభవం ఉంది. వారి రాక జట్టు పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేస్తుంది. 2027 ప్రపంచ కప్ జట్టులో షమీకి చోటు దక్కాలని కొంతమంది క్రికెట్ నిపుణులు భావిస్తున్నందున.. షమీ ప్రదర్శనను నిశితంగా గమనిస్తారు. అంతేకాకుండా ఈస్ట్ జోన్ జట్టులో అభిమన్యు ఈశ్వరన్ వంటి బ్యాటర్ కూడా ఉన్నాడు. షాబాజ్ అహ్మద్, అనుకుల్ రాయ్ వంటి ఆల్‌రౌండర్లు కూడా ఉన్నారు. 2026 దులీప్ ట్రోఫీకి ఈస్ట్ జోన్ జట్టు ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ కుమార్ ఘరామీ, షాబాజ్ అహ్మద్, సూరజ్ సింధు జైస్వాల్, మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్, కుమార్ కుశాగ్ర, శిఖర్ మోహన్, అనుకుల్ రాయ్, విరాట్ సింగ్, శుభ్రాంశు సేనాపతి, డానిష్ దాస్, అభిజిత్ సర్కార్

# జాతీయ జట్టుకు వీడ్కోలు: నెయ్‌మార్

ఫుట్‌బాల్ బ్రెజిల్ జాతీయ జట్టుకు వీడ్కోలు పలుకుతున్నట్లు దిగ్గజ క్రీడాకారుడు నెయ్‌మార్ (34) జూనియర్ తెలిపాడు. 16 ఏండ్ల కెరీర్ నుంచి రిటైర్ అవుతున్నట్లు అతడు అధికారికంగా బుధవారం వెల్లడించాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా అతడు రికార్డు నెలకొల్పాడు. ఫిఫా వరల్డ్ కప్-2026లో లీగ్ దశలో బ్రెజిల్ నార్వే చేతిలో 2-1 తేడాతో ఓడిపోయింది.


దీంతో వరల్డ్ కప్ నుంచి బ్రెజిల్ నిష్క్రమించింది. అప్పుడు జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. దేశం తరఫున చెమటో డ్చాను, పసుపు రంగు జెర్సీ వేసుకొని పోరాడాను. ఇక ఆ జెర్సీని ధరించను అని అన్నాడు. ఫుట్‌బాల్ ప్రపంచకప్, కోపా అమెరికా, ఒలింపిక్స్‌లలో ఆడాడు. కోపా సుండామెరికానా టోర్నీలో శాంటోస్ క్లబ్ తరఫున ఆడగా 4-2 తేడాతో యూనివర్సిడాడ్ సెంట్రల్ జట్టు ఓడిపోయింది. ఈ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో సహచర యువ ఆటగాళ్లను వెక్కిరించి, బెదిరించాడని వచ్చిన వార్తలను అతడు ఖండించిన సందర్భంగా



జాతీయ జట్టుకు రిటైర్‌మెంట్‌ను ప్రకటించాడు. నెయ్‌మార్ జూనియర్ బ్రెజిల్ జాతీయ జట్టు తరఫున 2010లో అరంగేట్రం చేశాడు. 2013 ఫిఫా వరల్డ్ కప్‌లో విజయం సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్రెజిల్ తరఫున నెయ్‌మార్ 130 మ్యాచ్‌లు ఆడి 80 గోల్స్ సాధించాడు.

# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ

### వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

### దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్ -నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు

తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన,
సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్టాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి.




ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 'రామాయణం' తర్వాత

# మరో మైథాలజీ..

### సాయి పల్లవి కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్!

సినిమా ఇండస్ట్రీలో సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఏకైక నటి సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో సౌత్ నుంచి నార్త్ వరకు అగ్ర హీరోయిన్‌గా దూసుకుపోతోంది. త్వరలో 'రామాయణం'లో సీతగా కనిపించనున్న ఈ సహజ నటి, మరో మైథాలజీ సినిమాకు కూడా ఓకే చెప్పినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. వివరాలు చూద్దాం.. ప్రత్యేకమైన పాత్రలతో సరికొత్త ట్రెండ్: ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లకు తమ వర్సటాలిటీని నిరూపించుకునే అవకాశాలు తక్కువగా వస్తుంటాయి. కానీ సాయి పల్లవి మాత్రం కథల ఎంపికలో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తోంది. ఇక మీడియం రేంజ్ హీరోల నుంచి పాన్ ఇండియా సినిమాల వరకు, నటనకు స్కోప్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటూ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు సౌత్ నుంచి నార్త్ వరకు బిజీ హీరోయిన్‌గా మారింది. వెండితెర సీతమ్మగా అలరించేందుకు సిద్ధం: ప్రస్తుతం ఆడియన్స్ అందరూ ఈ దీపావళికి థియేటర్లలోకి రాబోతున్న 'రామాయణం' సినిమా కోసం తీవ్ర ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇందులో సీతమ్మ పాత్రలో సాయి పల్లవి కనిపించబోతోంది. ఈ బాలీవుడ్ విజువల్ వండర్‌లో ఆమె పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతోందో అని దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు చాలా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. 'తండేల్' తర్వాత మరో తెలుగు ప్రాజెక్ట్: తెలుగులో 'తండేల్' సినిమా తర్వాత సాయి పల్లవి కొత్తగా ఏ ప్రాజెక్ట్‌కూ సంతకం చేయలేదు. దీంతో ఆమె తదుపరి తెలుగు సినిమా ఏదోనని ఫ్యాన్స్‌లో ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా దర్శకుడు కిషోర్ తిరుమల ఆమెకు ఒక పవర్‌ఫుల్ కథ చెప్పినట్లు తెలుస్తోంది. ఇక 'అమ్మోరు' తరహా కథాంశంతో సాగే ఒక మైథాలాజికల్ కథకు సాయి పల్లవి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. క్యూలో ఉన్న సౌత్ ప్రాజెక్టులు: ఒకవైపు మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతికి జోడీగా ఒక సినిమా, అలాగే ధనుష్‌తో 'ఓమ్' అనే తమిళ చిత్రంలో నటిస్తూ సాయి పల్లవి బిజీగా ఉంది. ఇక ఈ కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కే ఈ భారీ మైథాలజీ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. 'రామాయణం' తర్వాత సాయి పల్లవి కెరీర్‌లో రాబోతున్న వరుసగా రెండో మైథాలాజికల్ ఫిల్మ్ ఇది కావడం విశేషం. దేవుళ్ల కథ నేపథ్యం, భారీ బడ్జెట్‌తో తెరకెక్కే ఇలాంటి చిత్రాలలో సాయి పల్లవి తనదైన నటనతో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ వార్త నిజమైతే సాయి పల్లవి ఫ్యాన్స్‌కు పండుగే అని చెప్పాలి.



# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్




యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒకేసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.

# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం

విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి

### వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట్' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట్' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

